కె. యమ్. రాయుడు

# అధిగమనం



"నరసింహం, దే ఆర్ వెయిటింగ్ ఫర్ యూ" అంది సెక్రటరీ బాసుగదిలో నుండి వస్తున్న నరసింహాన్ని వుద్దేశించి.

బాసు మూడ్సును అంచనా కట్టే ఆలోచనలలో నిమగ్నమయ్యాడు నరసింహం. మూడ్సు అనేవి బాసు మనస్తత్వంలో ఒక భాగంగా మారుతూ రావటమే అందుకు కారణం. బాసు తన్ను దూరప్రాంతాలలోని సబ్ సెంటర్లలో జరుగుతున్న పనుల్ని పర్యవేక్షించేందుకు ఎక్కువగా పంపుతున్నాడు. తాను ఆ విషయమే ప్రస్తావిద్దామని వెళ్ళాడు.

"మీలో ముందుటిలా ఆసక్తి కనిపించటం లేదు. ఏమిటీ విషయం....?" ఏదో అర్థం చేసుకోవటానికి అడుగుతున్నట్టు అన్నాడు. అందుకే ఇంకేమీ తనుపెద్దగా మాట్లాడకుండా ఏదో చెప్పేసి వచ్చేశాడు.

"మహాదొంగ ... మనిషిని ఇట్లే ఇరికించి వేస్తాడు" అనుకొన్నాడు నరసింహం.

షి ఈజ్ సస్కియా ... హి ఈజ్ యాన్ ... పర్యావరణం మీద రీసర్చట .... మీట్ నరసింహం ...." అంది బాసు పర్సనల్ సెక్రటరీ, డచ్ యువతీ యువకున్ని పరిచయం చేస్తూ.

ఆలోచనల నుండి తేరుకుంటూ తనను తాను తిరిగి వారికి పరిచయం చేసుకొన్నాడు నరసింహం. కొంతమంది డచ్ యువతీ, యువకులు అప్పుడప్పుడు ఇండియాకు విచ్చేసి గ్రామ్ స్వచ్ఛంద సంస్థ పనిచేసే ప్రాంతాల్లో రీసర్చ్ చేస్తుంటారు. భారతదేశంలోని పేదప్రజలకు అన్నివిధాల సహాయ పడేందుకు గ్రామ్ సంస్థకు డబ్బు యిస్తున్న సంబంధంరీత్యా అప్పుడప్పుడు సంస్థ పనిచేసే ప్రాంతాల్ని ఆదేశం వారు సందర్శిస్తుంటారు.

అక్కడి నుండి నరసింహం వారితో కలిసి సంస్థ ఆఫీసు పక్క హాల్లో కూచొని మాట్లాడేందుకు బయలుదేరాడు. ఆ డచ్ జంటను నరసింహం ఒకసారి తదేకంగా చూశాడు. తనలో లేని ఏదో ఉత్సాహం, ఆసక్తి, మనుష్యుల్లోకి సూటిగా చూసి మాట్లాడటం వారిలో స్పష్టంగా కనిపిస్తోంది.

ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవటానికి ఏ విదేశీయునికైనా నరసింహంలాంటి ఒక అనువాదకుడు, తప్పనిసరి.

"రెండు నెలలు ఈ జంటతో ఉండక తప్పదా.... వారు ఏఏ గ్రామాలకు వెళ్ళాలంటే ఆయా గ్రామాలు తిరగక తప్పదా .... బాసుతో చర్చించాక ఆజంట నిర్ణయించుకొన్న గ్రామాల్లో తిరుగుతూ, వారు తయారుచేసుకొన్న ప్రశ్నల్ని ఏవర్గం ప్రజలతో అడగాలంటే ఆవర్గం ప్రజలతో మాత్రమే అడుగుతూ తెలుగు నుండి ఇంగ్లీషుకు యింగ్లీషు నుండి తెలుగుకు వూగక తప్పదా ...." అనుకొన్నాడు నరసింహం.

వారిని చూస్తుంటే ఏవేవో జ్ఞాపకాలు తరుముకొచ్చాయి నరసింహానికి.

"మీకు లెట్రీన్లు లేవా?"

"లేవు"

" లెట్రీన్‌కు ఎక్కడికి వెళ్తారు?"

"పొలాల్లోకి"

"పొలాల్లో దగ్గర దగ్గర కూచుంటారా? దూరం దూరమా...?"

ప్రజల్లో కొందరు ఈప్రశ్నలకు ఫక్కున నవ్వారు. ఇక్కడి పరిస్థితులు తెలియక వేసే ఇలాంటి ప్రశ్నల్ని ప్రజల్ని అడగాలంటే ఒక్కోసారి తనకు చాలా యిబ్బంది వేస్తుంది. అడగలేనంటే రీసర్చ్ కోసమని వచ్చిన ఆ విదేశీయులు గొణుగుతారు. ముఖ్యంగా వారు కనపరిచే అనుమానం నరసింహాన్ని మరింత యిబ్బంది పెడుతుంది. ప్రశ్నల్ని వేసిన తరువాత ప్రజల జవాబులకు ఫీలింగ్స్‌కు పొంతన కుదరకపోతే అనువాదకున్ని అనుమానించి - అర్థాన్ని సహితం యథాతథంగా మీరు అనువదించాలని కొందరు ఆశిస్తారు. రీసర్చ్‌కదా! విభిన్న కోణాలనుండి అర్థం చేసుకోవాలనే తాపత్రయం వారిది." అంటూ సర్దాడు శేఖర్. ఉద్యోగంలో అతను తనకంటే చాలా సీనియర్. ఇద్దరిది ఒకేడెస్క్.

గతంలో శేఖర్ ఈ పనుల్ని చూసేవాడు. భార్యకు ఏదో సీరియస్ జబ్బు కారణాన ఎక్కడికి కదలకుండా ఆఫీసులోనే ఏవో పనులతో సరిపెట్టుకొంటున్నాడు. శేఖర్ విజ్ఞప్తిని గుర్తులో పెట్టుకొని, రీసర్చ్ పనుల మీద దూరం మండలాలకు వెళ్ళాల్సి వస్తే నరసింహాన్నే కేటాయిస్తున్నాడు బాసు.

చుట్టూ జనం గుంపుకూడటం నరసింహానికి ఎందుకో నచ్చదు. "వీరు ఏదేశం? ఎందుకు వచ్చారు?" గ్రామాల్లో ఎక్కడికి వెళ్ళినా ఇలాంటి ప్రశ్నలే. ప్రతిసారి వీటికి జవాబు చెప్పలేక విసుగు వస్తుంది. జూలోని జంతువుల్లా చూస్తూ నిలబడితే ఎక్కడలేని చిరాకు వస్తుంది. తెల్ల చర్మానికి యిచ్చే మర్యాద, గౌరవం చూసినప్పుడు ఉక్రోషం ఉప్పొంగిపోతుంది నరసింహానికి. 'ఛీ ... ఛీ ... వెధవలు .... తెల్లచర్మం ఆధిపత్యం నుండి, దోపిడి నుండి, విముక్తి చెందినా బానిస

> మతం వేరైతేను యేమోయి ?
> మనసులొకటై మనుషులుంటే
> జాత మన్నది లేచి పెరిగి
> లోకమున రాణించునోయి !
>
> \- గురజాడ

బుద్ధులు ఇంకా పోలేదు.' అంటూ చీదరించుకొన్నప్పుడు నరసింహం ముఖం కందగడ్డలా తయారవుతుంది.

"ఆ విషయమేనా వారు చెప్పేది?" అని సూటిగా గుచ్చి గుచ్చి అడుగుతారు. ప్రశ్నల్ని అడగ్గా అడగ్గా జవాబుల్లో నుండి కొన్ని సగటు పదాలు తెలుతాయి. వాటిని గుర్తు పెట్టుకొని, వాటి అర్థాలు అడిగి తెలుసుకొని ఆయా సందర్భాలలో అనువాదంతో సరిపోల్చుకొంటుంటారు. ఈ అనుమానం చూసి ఓపిక పట్టలేక అనువాదం చేయకుండా నరసింహం కస్సున లేచి వెళ్ళి పోయిన సందర్భం లేక పోలేదు.

"నరసింహం నీమీద కాదు అనుమానం. రీసర్చ్ మీద వారికున్న శ్రద్ధే అది. ఎలాంటి మార్పులూ చేర్పులూ లేకుండా ప్రజలు చెప్పే మాటల్లోని అనుభవాన్ని, నిశ్శబ్దానికి వున్న

అప్పుడప్పుడు అనువదిస్తూ తనూ విదేశీయులతో తిరిగినా ఒకటీ లేదా రెండు రోజులు మాత్రమే. మొన్నీ మధ్య ఓడచ్ యువకునితో దాదాపు నలభై రోజులకు పైగా పల్లెలు తిరుగుతూ అక్కడే మకాం పెట్టటం అదే మొదలు. అప్పుడు జరిగిన ఒక సంఘటన ఇప్పటికీ గుండెను పిండినట్లు చేస్తుంది.

తమ చుట్టూ ఎప్పటిలాగే పుట్టపర్తి దగ్గర వుండే జగరాసుపల్లిలో పిల్లలందరూ గుమికూడుతూ వచ్చారు - అడుగుల్ని ముందుకు వేయటానికి కూడా వీల్లేన్నంతగా.

ఒక చిన్న పిల్లవాడు గుంపులో నుండి ఆడచ్ వ్యక్తికేసి చేయి చాచాడు. ఇంతలో మరో పిల్లవాడు చేయి చాచాడు. ఇలా క్షణాల్లో చాలా మంది చిన్నపిల్లలు చేతులు చాచి అడగటం ప్రారంభించారు. అతనికి అర్థం కావటం లేదేమో నరసింహం కేసి చూశాడు.

“రే, ఇంగ్లీషోళ్ళ దగ్గర దండిగా దుడ్లు వుంటాయి. యంత అడిగినా మంటే అంత ఇస్తారు. జోవులో చేయిపెట్టి తీస్తే, ఎంతొస్తే అంతయిస్తారు. నూరు రూపాయలనోటు, యాభైరూపాయల నోటు పిల్లోలకు యిస్తా వుంటే పుట్టపర్తిలో నేను చూసినా, వాళ్ళకు దుడ్లంటే లెక్కేలేదు”. అని ఒకపిల్లవాడు చెబుతూ వుంటే అడిగే చేతుల సంఖ్య పెరిగి దిగ్భ్రంధంగా తయారయింది. ఆవిదేశీయునికి విషయం పూర్తిగా అర్థంకాక ఆశ్చర్యంగా చూస్తున్నాడు. విదేశీయులతో గ్రామాల్లోకి వెళ్ళినప్పుడు ఇద్దరో ముగ్గురో పిల్లలు అడగటం తను చూసిందే. కానీ, ఇలా గ్రామంలోని పిల్లలంతా చుట్టూ నిలబడి అడుక్కోవటాన్ని చూడటం నరసింహం జీవితంలో అదే.

“ఈపిల్లలంతా నీముందు డబ్బుకోసం అడుక్కొంటున్నారు” అని అనువదించి చెప్పటానికి సిగ్గుపడ్డాడు నరసింహం. ఈనిజాన్ని అనువదించి పరాయిదేశస్థుల దృష్టిలో భావితరాన్ని చులకన చేయటం, తనలోని జాతిగౌరవం సహించలేకపోయింది.

“వాటీజ్ దిస్ ...” మరోసారి ఆసక్తిగా తనకేసి చూశాడు డచ్ యువకుడు.

“మీ ఆశీస్సుల కోసం” అన్నమాట నోటిదాకా వచ్చింది నరసింహానికి. సూటిగా అర్థం చేసుకొనే ఆసక్తి వారిది. ఆపిల్లల కళ్ళల్లో అడుక్కొనే తనంలోని దీనత్వాన్ని ఏశక్తితో, ఏ పదాలతో దాచగలడు తను.

ఇంతలో గ్రామంలో ఏదో విషయమై దండోరా వేయటంతో, ఆశ్చర్యంతో అతని చెవి అటువైపు మొగ్గింది. వెంటనే దాన్ని అవకాశంగా తీసుకొని గ్రామీణ సమాజం లో విషయ ప్రచార విధానాల్లో దండోరాకు వున్న ప్రాధాన్యతను తెలుసుకోవటం ఆసక్తికరమ యిందిగా వివరిస్తూ దారి మళ్ళించాడు. నరసింహం గుండెల్లో అది చెరగని దృశ్యంగా ఇప్పటికీ అలాగే వుండిపోయింది.

తళతళ మెరిసే తెల్లదనానికి, సంపన్నతకు పిల్లలు, పెద్దలు, అధికారులు ఆపుకోలేని వ్యామోహతకు లొంగిపోయి తిరిగి ఈ దేశాన్ని మీరే ఏలండి. మాకంటే మీరే నయమండి” అంటూ వారి పాదాల ముందు వుంచుతారా? అని అనిపిస్తూ వుంటుంది. నరసింహానికి - విదేశీయులకు ప్రజలు కనపరిచే ప్రాధాన్యత చూసి ఇతరదేశాల అప్పులతో, పెట్టుబడులతో భారతీయుల భవిష్యత్తు ఎంత ఉజ్వలంగా రూపుదిద్దుకొంటుందో అని ఇప్పటికే ప్రచార సాధనాల ద్వారా, ఎంతో అందమయిన పద బంధాలతో, ఎంతగా ప్రభుత్వం ఊదరగొడు తొందో తెల్సిందే తనకు.

‘పిల్లనాయళ్ళే’ తన ఆలోచనల నుండి బయటపడి హాల్లో కుర్చీపై తాపీగా వాలుతూ, ఆజంటకేసి మరీ తేరపార చూస్తూ అనుకొన్నాడు నరసింహం. తరచుగా ఇలాంటి పని మీద వచ్చేవారంతా ఇరవై ఏడు ఏళ్ళలోపు వారే. అయితే ఎదుటి వాళ్ళకు నలభై ఏళ్ళ వారిగా కనిపిస్తారు.

“నరసింహం, డ్రీమీగా వుంటాడు. ఆర్టిస్టు గుడ్ ఫిలాసఫర్.” అంది పర్సనల్ సెక్రటరీ - డచ్ యువతీ యువకున్ని ఒక్కక్షణం చూసి, ఆతరువాత నరసింహం వైపు తిరిగి చిన్నగా నవ్వుతూ.

“అసలు పనేదో చెప్పకూడదా సుగుణా, ఎప్పటి నుండి వీరితో పనిచేయాలో, ఏ గ్రామాలకు కలిసి వెళ్ళాలో .... ఆ షెడ్యూలు కాపీ యిస్తే సరిపోతుంది కదా ...” అన్నాడు నరసింహం చాలా అసహనంగా.

ఈసారి కూడా తానే ఒక రెండు నెలల పాటు ఆ డచ్‌జంటతో కలిసి గ్రామాల్లో, తిరగాల్సి వుంటుందనే విషయం సుగుణ నవ్వేతీరు ద్వారా స్పష్టమయింది. బాసును కలిసినా అతను, తనకు ఈ విషయాన్ని ప్రస్తావించలేదు. సుగుణ ద్వారా చెప్పటంలో బాసు అంతర్యమేమిటో అర్థంకాలేదు నరసింహానికి. ఛీ ... ఛీ ..’ అనుకొన్నాడు.


“వారు మీతో మాట్లాడి చర్చించాకనే డేట్సు తయారుచేస్తారట.” అంది సుగుణ.

“ఓకే...ఓకే...” అన్న నరసింహం గొంతులో అదే అసహనం. పర్సనల్ సెక్రటరీ ముఖంలో తన అసహనం కాస్తా యిబ్బందిని కల్గించటం నరసింహం గమనించకపోలేదు.

ఇప్పటికే క్యాంపులపై ఇటు అటు తిరగటం వలన భార్యతో, తల్లితండ్రులతో మిత్రులతో గడపటం ఫోన్లోనో, ఉత్తరాల్లోనో కలుసుకొన్నట్టు అనిపిస్తోంది నరసింహానికి. భార్య ట్రాన్స్‌ఫర్ కోసం అతను చేసే ప్రయత్నాలు ఇంకా అట్లాగే కొనసాగుతున్నాయి.

వారు పలికే తీరువల్ల, చదువురాని వారికే కాకుండా కాస్తా యింగ్లీషు తెల్సిన వారికి కూడా అనువాదం చేయాల్సి వుంటుంది. తెలుగు నుండి ఇంగ్లీషుకు, ఇంగ్లీషు నుండి తెలుగుకు అనువాదం చేస్తూ రావటం ఎంతో శ్రమ అనిపిస్తుంది. మధ్య మధ్యన ఒక రోజు విరామం తీసుకొన్నా ఊరక పడుకొనే లేక ఏదో నవల పట్టుకొనో పొద్దు పుచ్చుకొందా మనిపిస్తుంది. తిరిగి తను పెయింటింగ్సు వేయగలనా? అందులోకి లోతుగా వెళ్ళ గలనా? అనుమానమే .... బెస్టు లెస్‌జాబ్ అనుకున్నాడు నరసింహం.

“ఎగైన్ వెన్ వుడ్‌యూ మీట్ ఫర్ డిస్కషన్ సార్...” అంటూ డచ్ యువతి నరసింహాన్ని పరీక్షగా చూస్తూ అడిగింది.




“టుమారో సేమ్ టైమ్” అంటూ బరువుగా బయట పడ్డాడు నరసింహం. సుగుణపట్ల తను ప్రదర్శించిన అసహనం ఒకవైపు, పర్యావరణం రీసర్చ్‌సబ్జెక్టు మరోవైపు అతన్ని ఆలోచనల్లోకి తోసింది.

తనపట్ల ఎక్కడో కాస్తా అభిమానాన్ని ప్రదర్శించే సుగుణను బాసు సెక్రటరీగానే చూడటం తప్పేమో .... ఆ స్థానంలో ఎవరు వున్నా అదేపని చేస్తారు. ప్రభుత్వ సంస్థల్లోనైనా, ప్రభుత్వేతర సంస్థలలోనైనా పనిచేసే వాడి ఆలోచనలకు, ఆసక్తికి అవకాశం అంతగా వుండదు. పనిచేసే వారంతా బాసు వేలికింద కంప్యూటర్ బటన్సు మాత్రమే. పైనుండి కింది వరకూ కనెక్షన్సు వుంటాయి. అంతే.

పూర్ సుగుణ..... అనిపించింది నరసింహానికి. సుగుణ పక్కన తన పేరును కూడా కలిపి అనుకోవాలి. కానీ తనను అనుకోకపోవటం యాదృచ్ఛికం కాదు.


సంస్థ చేస్తున్న పనిపట్ల తన అంతరంగంలో రూపుదిద్దుకొంటున్న అభిప్రాయాలేవో ఓసారి బాసుకు వివరించాడు నరసింహం.

"పేదరికం యాచకత్వాన్ని వృద్ధి చేస్తుంది. అలాగే పేదరికం నిర్మూలించేందుకు మనం ఖర్చు చేస్తున్న విదేశీ డబ్బు సహితం అదే పనిచేస్తోంది. లోలోపల మనమీద ప్రజల్లో నిజమైన గౌరవాన్ని కూడా పోగొడుతోంది. దానికి బదులు విదేశీయులే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంకేతికపరంగా ఎలాంటి సహాయాన్నైన పరస్పర సంబంధాలలో నేరుగా బహిర్గత పరుచుకొనేలా చూస్తే మనం ఆశించే అభివృద్ధి జరుగుతుంది. విదేశీ డాక్టర్లు ఇక్కడికి వచ్చి కొద్దికాలం వుండి ఇక్కడి రోగుల్ని బాగుచేయటం, అలాగే ఇక్కడి దళిత యువకుల్ని ఆదే సామాజిక పరిస్థితుల లో గడిపేలా చూడటం - ఇలా అన్నిరంగాలకు ఆయా వ్యక్తుల్ని నేరుగా వారి ప్రేమను, అవసరమయిన సహాయాన్ని అందుకొని అభివృద్ధి అయ్యేలా చూడటం బాగుంటుంది' అన్నాడు నరసింహం, చర్చల సందర్భంగా. ఆ మాటల్లో కాస్త ఫోర్సు వుండవచ్చు.

"ప్లీజ్, నా ఆలోచనా విధానంలో జోక్యం కల్పించుకోవద్దు. ఏం చేయాలో నాకు తెలుసు ..." అన్నాడు బాసు. ఆమాటల్లో అసహనం వ్యక్తం కావటానికి తన సంస్థ నిర్మాణాన్నే నరసింహం ఎక్కడో ప్రశ్నించినట్టు అనిపించింది కాబోలు. విదేశీ డబ్బు సహాయంతో భవిష్యత్తులో మెంబర్ ఆఫ్ పార్లమెంటుకు పోటీ చేయబోవటం సరైన నిర్ణయం కాదని పరోక్షంగా వేసిన విసుర్ల వలన కూడా అతనంటే ప్లజింగ్‌గా లేడు బాసు.

పర్యావరణం మీద రీసర్చ్ అంటే ఆసక్తి పుట్టుకొచ్చింది నరసింహానికి.

అక్కడక్కడ తప్ప పెద్దగా కనిపించని చెట్లు, లేదా ముళ్ళపొదలు - రాళ్ళు తేలిన కొండలు - గాలివేగంతో విస్తరిస్తున్న నేలకోత - పాతాళాన్ని శోధించే బోర్లతో రైతులకళ్ళల్లో వూరుతున్న అప్పుల భయాలు - తాగేనీటి కోసం సహితం ఎండకాలంలో మనుష్యులు, పశువులు పడే కటకట - ప్రతియేడు వ్యసనంగా మారుతూ కొండల్లో కూడా విస్తరిస్తున్న వేరుసెనగసాగు - సరిగా చినుకు పడకపోతే కసాయిశాలలకు వెళ్ళే పశువులు - వలస వెళ్ళే కూలీజనం - తరుచుగా వచ్చే కరువుతో మాటల్లో, ఆకాశానికేసి చూసే చూపుల్లో నీటి పట్ల కనపరిచే అబ్‌సెసన్ - ప్రతిపక్షంలో వుంటే తప్ప కరువుపై, నీటి జలాలపై పెగలని రాజకీయ నాయకుల గొంతులు - అనంతపురానికి చెక్కు చెదరని ముఖచిత్రం. అది ఎప్పుడు గుర్తుకొచ్చినా, మనసులో సన్నటి ముళ్ళులా గుచ్చుకొంటూ వుంటుంది నరసింహానికి.




పగుళ్ళుబారిన భూమిలో రాళ్ళు, రప్పలూ బ్రహ్మజెముళ్ళ మధ్య నుండి పైకి చీల్చుకొచ్చి మండే సూర్యునికి ఆవల ఆకాశాన్ని గేబరించే హస్తాల తైలవర్ణచిత్రాన్ని ప్రారంభించి పూర్తీ చేయలేకపోయాడు నరసింహం.

పర్యావరణం మీద వున్న ఆసక్తితోనే వచ్చిన విదేశీయులతో తిరగటం నచ్చక పోయినా కాదనలేకపోయాడు నరసింహం.

'విదేశీ అందం అతని మనసులో కదులుతోంది . గుండ్రటి ముఖం, నీలిరంగు కనుపాపలు, ప్రకాశవంతమయిన భారీవిగ్రహం, పటిష్టంగా కనిపించే ఎత్తయిన చనుకట్టు, సమ్మోహనపరిచే చిరునవ్వు - ఇవన్నీ తన్ను తేలికపరిచే ట్యాబ్లెట్సుగా తన అంతరాంతరాలలో పనిచేస్తాయా ....?' కాదని స్పష్టంగా నిర్ధారించుకోలేక పోయాడు నరసింహం. తనలో ఒక మృగం మహాబలంతో అటుఇటు కట్టలు తెంచుకొని పరుగులు తీస్తున్న శబ్దం వినిపించకనూ పోలేదు నరసింహానికి.

క్యాంటీన్‌లో కూచొని సిగరెట్టు అంటిస్తూ టీ ఆర్డర్ చేశాడు. టేబుల్ మీదికి టీ వచ్చిందో లేదో ఓ మిత్రుడు మోటర్ సైకిల్‌ను ఆపి ఆత్రంగా నరసింహాన్ని సమీపించాడు.

నరసింహం మరో టీ ఆర్డర్ చేసేంతలోగానే "నాకొద్దుసార్, పోదాంసార్, వాళ్ళంతా పార్టీలో బాటిల్స్ ఓపెన్ చేసి మీకోసం కూచున్నారు" అన్నాడు ఆమిత్రుడు.

మందంటే పడని తనకు ఐదేళ్ళ ఉద్యోగ కాలంలో, పార్టీలలో తనకు వచ్చిన ప్రాముఖ్యాన్ని చూసుకొని నవ్వుకోవాలో, చింతించాలో తోచలేదు నరసింహానికి. అవసరాలు తయారు చేసిన పంజరంలో బలవంతంగా జీవించే వ్యక్తికి ఇలాంటి తీవ్రమైన అలవాట్లే సోకాల్డ్ సంతోషాన్ని నింపే ప్రత్యామ్నాయ మధురానుభవాలు మందైనా, ఇమేజ్ అయినా, దేవుడయినా, గురవైనా ఒక్కటే.

గబగబా టీ తాగేసి మిత్రుడి మోటర్ సైకిల్ మీద ఎక్కి కూచున్నాడు నరసింహం.

★ ★ ★

తనకల్లులో సంస్థ సబ్‌సెంటర్ ఏర్పాటు చేసిన ఒక పురాతనమయిన గృహంలో మకాం పెట్టారు నరసింహం, డచ్ జంట సస్కియా, యాన్. చుట్టూ గదులు వుండి మధ్యన చతురస్రాకారంలో వసారాలు వుండే ఆ యింట్లో - గాలి, వెలుతురు బయటి నుండే కాక లోపలి నుండే అన్ని గదులకు, అన్ని మూలలకు వ్యాపించటం ఎంతో నచ్చిన విషయం నరసింహానికి. భారతీయ భావజాలానికి ఆగ్రహాల్లాంటివి మచ్చుతునకలేమో. మధ్యన ఒక బావి కూడా వుంది కానీ నీరు లేక ఎండిపోయింది. కొన్ని గదులు సరైన ఆలన పాలన లేక దెబ్బ తిన్నాయి కూడా. వసారాలో కూచొని మాట్లాడుకొంటూ, చదువుకొంటూ ఆకాశాన్ని చూసుకొనే కప్పులేని ఆ ఇల్లంటే వల్లమాలిన అభిమానం నరసింహానికి.

ఆరోజు సస్కియాకు కడుపులో కాస్త నొప్పిగా వుంటే ప్రోగ్రాం రద్దు చేసుకొన్నారు - తిరగటంతో మరింత యిబ్బందిగా తయారవుతుందేమో అని. ఎంతో జాగ్రత్త తీసుకొన్నా యిలా ఎందుకు జరిగిందా అని ఒకటికి పదిసార్లు తన తిండి తీర్థాల్ని గుర్తుకు తెచ్చుకొనేందుకు ప్రయత్నించింది సస్కియా. ఎక్కువగా భోంచేసే మనిషి కూడా కాదు తను సరిగా వుడకని గుడ్డుతినటం వల్లే ఇలా అయి వుండవచ్చుననే ఆలోచన గట్టిగా మనసులో తట్టకపోలేదు.



ఉదయాన నీరు తప్ప టిఫిన్ చేయలేదు. ఏదో పుస్తకం పట్టుకొని చదువుకొంటూ పడక మీదే వుండి పోయింది సస్కియా. నరసింహంతో పాటు టిఫిన్ చేసి ఆమె పక్కనే కూచొని కిటికీ అవతలకి చూస్తూ కూచున్నాడు నస్కియా బాయ్ ఫ్రెండ్ యాన్. ఏ సమయానికి అనుకొన్న పనిని ఆసమయానికి చేయలేని స్థితిని విదేశీయులు మనంత తేలిగ్గా తీసుకోలేరనిపిస్తుంది.

మిత్రులకు, వుత్తరాలు రాద్దామా అనుకొంటూ, 'వెలితిగా వుందేమిటా' అని ఆలోచిస్తుండగా చాలాసేపటి నుండి సిగరెట్టు లేక త్రాగలేదనే విషయం గుర్తుకు రావటంతో రోడ్డున పడ్డాడు.బజార్లో ఆకస్మికంగా కలిసిన ఓ మిత్రుడితో గడిపి తిరిగి వస్తుండగా 'సార్! మీరు ఇప్పట్లో పల్లెకు వీళ్ళతో రావటం బాగుండదు. నిన్నరాత్రే ఖూనీలు జరిగినాయ్. ఇద్దర్ని కొడవళ్ళతో, గొడ్డళ్ళతో నరికినారు". అంటూ నరసింహంతో చెవ్వుకొచ్చాడు రామప్ప. అతను ఆప్రాంతంలో నరసింహం పనిచేస్తున్న సబ్‌సెంటర్‌లో గ్రామసేవకుడు.

నరసింహానికి చాలా బాధవేసింది.

"ఎందుకు?" అన్నాడు నిర్లిప్తంగా

"చెనిక్కాయల డబ్బులుసార్ ... అవి వుండనీవు ...." అన్నాడు రామప్ప చాలా సహజంగా.

వెంటనే సస్కియా ఈమధ్యనే అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. మూడు వారాలుగా తను సస్కియా, యాన్‌లతో కలియ తిరుగుతున్నాడు.

ఆరోజు చెక్కభజనతో మల్లిరెడ్డిపల్లిలో జనాన్ని కుప్పేసిన తరువాత తమ అసలయిన కార్యక్రమం మొదలయింది. వెన్నెట్లో కళ్ళాల దగ్గర ఇంకా చెనక్కాయలు పెర్కొంటూ కూచుంటున్న స్త్రీలు సహితం అక్కడికి చేరారు. ఏఉద్దేశ్యంతో అక్కడికి చేరుతున్నారో వాళ్ళకు తెలుసు సంస్థ సబ్‌సెంటర్ కార్యకర్తల వలన ఆ వెన్నెట్లో పిల్లలతో వేసిన చెక్కభజన భంగిమలు, వెన్నెల మింగలేని దుమ్ములోని శ్రమైక జీవనసౌందర్యం, ఆడచ్‌జంట వేస్తూ వచ్చిన ప్రశ్నలూ అన్నీ ఏకముఖంగా అనిపించాయి.

"మీరు గతంలో వేస్తున్న సాంప్రదాయకమయిన స్వయం పోషక పంటల్ని వదలి డబ్బు పంటలయిన వేరుసెనగను ఎందుకు వేస్తున్నారు." వంటి ప్రశ్నల్ని సస్కియా ప్రజల్ని అడగటం ప్రారంభించింది. తను అనువదిస్తూ వుంటే యాన్ మాత్రం రానుకొంటూ కూచున్నాడు. ఒకసారి జవాబులు చెప్పేవారి సంఖ్య పెరిగి కంట్రోలు చేసే పరిస్థితి ఏర్పడింది కూడా.

వారు చెప్పే జవాబులు విన్న తరువాత సస్కియా ఇలా చెప్పటం ప్రారంభించింది.

"హైబ్రీడు విత్తనాలవటం వలన ఎక్కువ నీటిని, ఎక్కువ సారాన్ని, ఎక్కువ మందుల్ని కోరుకొంటాయి. అంతేకాకుండా నేలకు, నీటికి, పశుపక్ష్యాదులకు, శారీరక ఆరోగ్యానికి కూడా ముప్పు తెస్తాయి. ఒక్కసారిగా, మొత్తంగా కనిపించే డబ్బును లెక్కలోకి తీసుకొంటారు కానీ పైకి కనపడకుండా ఎన్నో రూపాల్లో భారీగా పోగొట్టుకొనే నష్టాన్ని దృష్టిలోకి తీసుకోరు. తొందరగా, భారీగా, అత్యంత లాభసాటిగా దూసుకొనిపోయే హైబ్రీడు మనిషిగా చేయటం వలన ఎప్పటికప్పుడు ఏదో కొరత ఏర్పడే సందర్భాన్ని సృష్టిస్తూ, దానిమీద మార్కెట్‌ను విస్తరింపచేసేస్తూ వ్యక్తులు, దేశాలు సుసంపన్నం కావాలని చూస్తాయి. అందుకు వాళ్ళు విసురుతున్న వలలే ప్రచారసాధనాలు". ప్రజల జవాబుల అనంతరం తమ అభిప్రాయాలు చెప్పుకు రావటం వారు చేస్తున్నదే. ప్రజలకు ధన్యవాదాలు చెప్పి పంపిన తరువాత తన్ను ఆకస్మికంగా అడిగింది సస్కియా.

"ఈ జిల్లాలో క్రైమ్‌రేట్ ఎలా వుంది?"

"రోజురోజుకూ పెరుగుతోంది. పక్కజిల్లా వాళ్ళవి బాంబులయితే అనంతపురం జిల్లా స్పెషల్ కత్తులు, కొడవళ్ళు, గొడ్డళ్ళు, బాంబుల్ని అలావేసి వెళ్ళటంకంటే కత్తులతో, గొడ్డళ్ళతో మనిషిని చంపేందుకు నేరుగా పోటీ పడటంలోనే తీవ్రమయిన క్రూరత్వం కనిపిస్తుంది" అన్నాడు తను.

"తమ శక్తిసామర్థ్యాల్ని బట్టి తిండి తీర్థాల వంటి అవసరాలు మొదలుకొని, సుఖ సాధనాల వరకూ యిచ్చి పుచ్చుకొనే విధానాన్ని సులభతరం చేసేందుకు 'మనీమెకానిజాన్ని' ప్రభుత్వాలు భారీగా వాడుకొంటున్నాయి. అయితే 'మనీమెకానిజమే సరస్వ స్వయమయినప్పుడు ఫ్యాక్టరీలోనేకాదు, చేన్లలోనయినా ఆసక్తి, సంబంధం లేనితనం (ఎలియనేషన్) ఉత్పత్తి అవుతుంది. దాన్ని వ్యక్తులు భరించగలిగే స్థాయి మించితే విభిన్న రూపాల్లో హింస బహిర్గతమవుతుంది" అంది సస్కియా.

రామయ్యను పంపివేసి సస్కియా మాటల్లోని వాస్తవాన్ని ఆలోచిస్తూ యింటికి చేరుకొన్నాడు నరసింహం.

సస్కియా కడుపులో నొప్పి పెరుగుతోంది తప్ప తగ్గుతోన్న ఛాయలు కనిపించటం లేదు. నరసింహం రావటం చూసి -

"ఎక్కడో చాలా సేపు వెళ్ళారే నరసింహం?" పడుకొనే పలకరించింది సస్కియా. దాదాపు రెండుగంటలు అయినాక కానీ రాలేదు నరసింహం.

"పాతమిత్రుడు కనిపిస్తే ఉద్యోగ అసంతృప్తుల్ని గురించి మాట్లాడుకొంటూ టీ హోటల్‌లో కూచుండిపోయాం ..... ఇప్పుడు మీకు ఎలా వుంది?" అన్నాడు నరసింహం.

"ఉదయంకంటే బాగాలేదు" అంది సస్కియా.

"ట్యాబ్లెట్లు తెచ్చేదా?"

"అనవసరంగా వాటిని వొంట్లోకి పంపటమెందుకు?" ఆనొప్పిలోనూ నవ్వుతూ చెప్పేందుకు ప్రయత్నించింది. యాన్ ఆమె చేయిపట్టుకొని కూచున్నాడు.

"ఉద్యోగం గురించి మీ అభిప్రాయం." సందర్భం అనుకొందేమో అడిగింది సస్కియా.

"ఆసక్తి ఎందుకో తగ్గుతోందనిపిస్తోంది.'

కలుక్కున ఏదో గుచ్చుకొన్నట్టు బాధగా మూల్గింది సస్కియా. ఏదో చెప్పబోయిన నరసింహం సస్కియా బాధను చూసి ఆ ప్రయత్నాన్ని విరమించుకొన్నాడు. దేహం మెలికలు తిరిగేనొప్పి మొదలయింది.

బయట ద్వారానికి అడ్డంగా నిలబడి చూస్తున్న పిల్లలకేసి కేక వేస్తోంది దేవమ్మ. గతవారంగా తాము వుంటున్న గదులలో నీళ్ళు తెచ్చిపోయటం, గదుల్ని శుభ్రంగా

వుంచటం, వంటి పనుల్ని ఆవిడే చూస్తోంది. టీ అడిగారేమో ఫ్లాస్కులో పట్టుకొచ్చింది దేవమ్మ. యాన్ ఆమె తెచ్చిన టీ ఫ్లాస్కును అందుకొని పక్కన పెట్టాడు.

సస్కియాకు నొప్పి తగ్గటం అటువుంచి బాగా పెరుగుతున్నట్టు అనిపిస్తోంది - ఆమె ముఖంలోకి చూస్తే ఆమె కళ్ళల్లో కారుతున్న కన్నీళ్ళను చూసేసరికి మనసంతా ఏదో బాధ దట్టంగా అలుముకొంది నరసింహానికి.

"డాక్టరును పిలుచుకు వచ్చేదా" అన్నాడు నరసింహం. కళ్ళు మూసుకొనే బాధతో మూల్గుతూ వద్దన్నట్టు తలవూపింది సస్కియా.

బాధతో ఆమె మూల్గుతుంటే యాను ముఖంలో ఆందోళన పెరుగుతోంది. ఈ పరిస్థితినరసింహాన్ని కంగారుపరుస్తోంది.

సస్కియా తల దగ్గర మోకాళ్ళ మీద కూచొని దేహాన్నంతా వొంచి ఆమె పెదాలల్లో తన పెదాల్ని కలిపి చుంబిస్తూ ఆమె జుత్తులోకి తన వేళ్ళను జరిపి తలను నిమరసాగాడు యాన్. ఆమె మూల్గుల్ని తను వినలేక నొక్కి పెడుతున్నాడో లేక ఏ అదృశ్య శక్తో పరీక్ష పెడితే తన ప్రేమనంతా ఒక్కసారి ఫణం పెట్టి చూపడం ద్వారా నయం చేయాలని చూస్తున్నాడో అర్థం కావటం లేదు నరసింహానికి.

ఎందుకో, ఏమో, తనతో పాటు కూచొని కంట తడితో చూస్తున్న దేవమ్మ బయటికి వెళ్ళిపోయింది. అరగంట తరువాత ఇద్దరు ఆడవాళ్ళు, ఒక మగవ్యక్తితో ప్రత్యక్షమయింది. అందులో ఇద్దరు నడివయస్కులు, చదువు కొన్నవారిలా అగుపిస్తారు.

"దేవుని వాక్యం చెప్పుకొని స్వస్థతకోసం ప్రార్థన చేయటానికి వచ్చాం. మీరు కూడా రండి". అని యాన్‌ను పిలిచారు వచ్చిన వ్యక్తులు. వారి మతసాహార్ధత ఆశ్చర్యం వేసింది నరసింహానికి.

కాస్తా తలపైకెత్తి - "మేము క్రైస్తవులంకాము" అన్నాడు యాన్. సస్కియా కూడా కంటి తడి మధ్య తిరుగుతున్న గుడ్లను నిలిపి వారికేసి చూస్తూ,

"నేను పుట్టినప్పటి నుండే క్రైస్తవ మహిళనుకాను" అంది మెల్లగా శక్తిని కూడదీసుకొంటూ. వూహించని విషయం కావటంతో వచ్చిన వారి కళ్ళల్లో యిబ్బంది కనిపించింది. మామూలుగా విదేశీయుల్ని క్రైస్తవులనుకొనే భావన సహజంగా కలిగేదే. నరసింహం కూడా అలాగే అనుకొన్నాడు - సస్కియా, యాన్‌ను గురించి.

నొప్పి ఎక్కువగా వుండటం వలన ఆమె చెప్పాలనుకొనే విషయాల్ని తనే చెప్పుకొచ్చాడు యాన్.

సస్కియా అమ్మా, నాన్న రోమన్ క్రైస్తవులు. తాము పాటిస్తున్న మతాన్ని ఒకరిమీద రుద్దటం సరైనది కాదనేది వారి అభిప్రాయం. చివరికి తమ బిడ్డలపైన అయినా సరే. అందుకే సస్కియాకు బాప్టిజమ్ యిప్పించలేదు. చదువుకొని, మానసికంగా ఎదిగాక - తన అంగీకారాన్ని పట్టించుకోకుండా మతం చట్రంలోకి తన్ను అమాయకురాలిని చేసి బంధించారని తన కూతురు బాధపడకుండా చూడాలనేవారు అవని చేశారు. వారి వుద్దేశ్యాన్నే నిజం చేసింది సస్కియా. తనకు యిప్పటికీ సస్కియాగా వుండటమే యిష్టం. నా విషయంలో అలా జరక్కపోయినా, నేను కూడా మతానికి దూరం" అన్నాడు యాన్ స్పష్టంగా.

'తనకు యిప్పటికీ సస్కియాగా వుండటమే యిష్టం" అని యాన్ అన్నప్పుడు అంత బాధలోనూ ఆమె కళ్ళల్లో గొప్పకాంతి కనిపించింది.

యాన్ మాటల్ని అనువదిస్తున్నప్పుడు నరసింహానికి తనే మట్లాడుతున్నంత సహజంగా వచ్చాయి వాక్యాలు. తన అంతరాంతరాళల్లోని తపనను బయటికి తెచ్చే విషయాల పట్ల తాదాత్మ్యం నరసింహం ముఖంలో స్పష్టంగా కనిపిస్తుంది.

యాన్ ఎంత మృదువుగా చెప్పినప్పటికీ కాస్తా అసంతృప్తిగానే వెళ్ళిపోయారు దేవమ్మ పట్టుకొచ్చిన వ్యక్తులు. ఈ సంఘటన తరువాత ఎక్కడో తను తెల్లచర్మానికి అడగున రక్తానికి అతుక్కుపోతున్నట్టు అనిపించింది నరసింహానికి.

'కొబ్బరినీళ్ళ' ఆలోచన ఫ్లాష్‌కావటంతో గబగబ బయలుదేరి రెండు టెంకాయలు పట్టుకొచ్చాడు నరసింహం. కాస్తా నెమ్మదించినట్టు వుంది కాబోలు సస్కియా కదలకుండా పడుకొని వుంది. ఒక కాయ కొట్టి కొబ్బరి నీళ్ళు గ్లాసులో పోసి 'కొబ్బరినీళ్ళు ఎంతో మంచివి' అని సస్కియాకు గ్లాసు అందించాడు నరసింహం. మొదట వద్దన్నా నరసింహం మాటను మన్నించి తాగింది. కొబ్బరి నీళ్ళు తాగటం అదే మొదటిసారి సస్కియాకు.

ఒగంట తరువాత దేవమ్మ క్యారియర్ తీసుకువస్తుంటే మటన్ వాసన గుప్పున కొట్టింది నరసింహానికి. ఈ రోజు ప్రోగ్రాం రద్దు చేసుకొన్నారని తెలియటం వలన కాబోలు సబ్‌సెంటర్ కోఆర్డినేటర్ శివయ్య యింటి నుండి స్పెషల్ భోజనం వచ్చిందను కొన్నాడు. నరసింహం లోపలి గదిలో క్యారియర్ పెట్టేసి నీళ్ళు, పాత్రలు సిద్ధం చేసి చెప్పి వెళ్ళిపోయింది దేవమ్మ.

ఇంటి నుండి క్యారియర్ వచ్చిన పది నిమిషాల తరువాత క్యాంపునుండి ఇల్లే వారిని కలిసేందుకు వచ్చాడు శివయ్య. జరిగిన విషయం విన్నాక క్షమాపణ చెప్పకుండా వుండలేకపోయాడు. మోటర్‌సైకిల్ చెడిపోవటం వలన తను రావటం ఆలస్యమయిందని, సమయానికి వుండలేకపోయానని పదేపదే తన విచారాన్ని వ్యక్తం చేశాడు శివయ్య. కొద్దిసేపయ్యాక భోంచేసేందుకు నరసింహాన్ని, యాన్‌ను ఆహ్వానించాడు. సస్కియాకు ఏం తెప్పించాలని నరసింహం కేసి చూశాడు.

"ఇప్పుడే కొబ్బరినీళ్ళు తాగింది. భోంచేయనని చెప్పింది". అన్నాడు యాన్. ఆమె నిద్రపోతూ వుండటంతో ఎవరూ ఆమెను ప్రస్తావించే ప్రయత్నం చేయలేదు. శివయ్యతో సహా ముగ్గురూ భోజనాలు ముగించామనిపించారు.

యాన్ అసలు మటన్ ముట్టలేదు, శివయ్య ఎంతో బతిమాలినా తనకు తెలిసినంత వరకూ మటన్ తినని విదేశీయుల్ని చూడలేదు. వినలేదు. హరేరామ హరేకృష్ణ వంటి మత సంప్రదాయాల్ని పూర్తిగా నమ్మి అనుసరించే విదేశీయుల్లో మాత్రమే ఆవిషయాన్ని గమనించాడు. పర్సనల్ విషయమేమో అని అనిపించినా, ఆవిషయాన్ని అడక్కుండా వుండలేక పోయాడు నరసింహం.

ఎందుకో రెండు క్షణాలు ఆగి నరసింహం కేసి చూస్తూ చెప్పుకొచ్చాడు యాన్.

"మాంసానికి వుండే డిమాండ్ రీత్యా నిల్చుకోవటానికి లేదా కూచొని మునికాళ్ళ మీద పడుకోవటానికి మాత్రమే చోటుంటే బాక్స్‌ల్లో మాంసంకోసం మాదేశంలో పశువుల్ని పెంచుతున్నారు. ఆవుల దేహంలోకి స్పెర్మ్‌ను పంపి అత్యధిక సంఖ్యలో ఉత్పత్తి చేసి మగవాటిని ఒక సంవత్సరం తరువాత మాంసంగా మార్కెట్‌లోకి తెస్తారు. రక్తం తక్కువగా వుండి, నోటికి మృదువుగా అనిపించే ఈ 'వైట్ మటన్' ఎద్దులు, అలాగే ఆవులు మేయటానికి గడ్డి కోసం ఇప్పటి మాదేశానికి ఆరురెట్ల నేల కావాల్సి వుంటుంది. అందుకే టాపియోకాను హైబ్రీడు గడ్డిజాతి కింద మార్చి - థాయ్

ల్యాండు, ఇంకా ఇతర దేశాల్లో నుండి అత్యధికంగా దిగుమతి చేసుకొంటూ వచ్చారు. మల్టీ మిలియనియర్సు, ప్రభుత్వమూ ఆ గడ్డిపంట పెట్టేందుకు ఆదేశ ప్రజల మీద వొత్తిడి కూడా చేస్తున్నారు. ఈ పంట కోసమే థాయ్‌ల్యాండులో పెద్ద ఎత్తున అడవుల్ని నరికి వేశారు. భూసారం, నీటిమట్టం తగ్గిపోయి ఈజిల్లాలా బోసిగా వుంది. ఇంకో వైపు మాదేశంలో పశువుల పేడ, గంజు పెరిగి వాటితో, యాసిడ్ రైన్సు ఎక్కువయ్యాయి. వీటిని నేలలో పాతిపెట్టాలని చట్టపరంగా వొత్తిడి రావటంతో అవి నీటిలోకి, ఖనిజ లవణాలలోకి చేరుకొని క్యాన్సర్ వ్యాధుల్ని సృష్టిస్తున్నాయి. ఇలా ఒకదానివెంట నురో పర్యావరణ సమస్యకు తీసుకువెళ్ళే విధానాల్ని ఎదుర్కోవటానికి మాదేశంలో రైతులకు భారీ ఎత్తున ఖర్చు, అత్యంత సాంకేతిక విజ్ఞానం, పనిముట్లు ఉపయోగించాల్సి వస్తోంది. దీంతో సన్నకారు రైతులు అదృశ్యమవుతూ పెద్ద రైతులు ముందుకు వస్తున్నారు. ఈ కాలుష్యాన్ని ఎక్కడో ఒకచోట నుండి బ్రేక్ చేస్తూ విస్తరించాలి కదా! అందుకే సస్కియా, నేనూ మటన్ తినటం మానివేశాం" అంటూ చెప్పుకొచ్చాడు యాన్.

అంతకు మునుపుకంటే గట్టిగా మూల్గులు మరీ ఎక్కువయ్యాయి సస్కియా గది ముందు వసారాలో నుండి. అతను ఆత్రంగా లేచి ఆమె దగ్గరకు పరుగుతీశాడు. మూడంకెలు వేసి కడుపు మీద చేయి పెట్టుకొని విపరీతంగా మూల్గుతూ, అటు ఇటు చిన్నగా పొర్లుతోంది. 'కీ' యిచ్చినట్టు తల ఇటు అటు దొర్లిస్తోంది. కళ్ళల్లో నుండి కన్నీళ్ళు దూకుతున్నాయి. ఆమెను చూస్తుంటే, యాన్ ముఖంలో ఆందోళన, విషాదం దట్టంగా అలుముకొంది. అతను ఆమె తల దగ్గర మునికాళ్ళ మీద కూచొని తన దేహాన్నంతా వొంచి కంట తడిపెడుతూ, ఆమె కళ్ళ కొనల నుండి కారిపోతున్న కన్నీళ్ళను చూడలేనంత దగ్గరగా ముఖం అన్చి, జుత్తులోకి వేళ్ళను జరిపి నిమురుతూ, పెదాలను చుంబిస్తూనే పలకరించసాగాడు డచ్‌భాషలో.

మెలికలు తిరుగుతున్న ఆమె దేహాన్ని, పొంగి వస్తున్న కన్నీళ్ళను,ఎడతెగని అతని ఆందోళనను యిక భరించలేకపోయాడు నరసింహం.

"డాక్టర్‌ను తెస్తాం" అని నరసింహం, శివయ్య పదే పదే అడిగారు. డాక్టరును పిలుచుకొని రమ్మని శివయ్యకు చెప్పి పంపాడు నరసింహం.

యాన్, సస్కియా నుండి రెస్పాన్సు రాలేదు.

సస్కియా ఏం చెప్పిందో తెలియదుకానీ, కాస్సేపయ్యాక లోపలికి వెళ్ళి ఓపాత్ర, మంచినీళ్ళ చెంబు పట్టుకొచ్చాడు యాన్. ఆమె లేచి కూచొందో లేదో ఇంతలోనే వాంతి చేసుకొంది సస్కియా. గుప్పున దుర్వాసన వచ్చింది, అక్కడే వున్న నరసింహానికి, యాన్‌కు పాత్రలోకి ఒక్కసారి చూసి ముఖం తిప్పుకొన్నాడు నరసింహం. ఆమె శుభ్రంగా నోరు, ముఖం, కడుకొన్న తరువాత ఆపాత్రను కడిగేందుకు బయటికి తీసుకెళ్ళాడు, యాన్. సస్కియా కళ్ళు మూసుకొని పడుకోగానే ఆమె పక్కనే కూచున్నాడతడు. ఆమెకు వాంతి అయ్యాక నరసింహం మనసు తేలికపడింది. కొబ్బరినీళ్ళు బాగా పనిచేశాయో అనుకొన్నాడు. ఆమాట వారితో అన్నాడు కూడా.

వెంటనే దొరికిన ఒక ఆర్.యం.పి. డాక్టరును పట్టుకొచ్చి నరసింహానికి, యాన్‌కు పరిచయం చేశాడు శివయ్య.

"ఇంక సమస్య తీరినట్టే. ఒకవేళ అవసరమనుకుంటే కలుస్తాం". అని చెప్పి పంపివేశాడు నరసింహం, యాన్ సూచనమేరకు శివయ్యను, డాక్టరును పంపించి వేసి తన గదిలోకి వెళ్ళి మంచం మీద పడుకొన్నాడు నరసింహం.

వారిని చూస్తుంటే ఏదో భరోసా. రంగును పక్కకు పెడితే అనంతపురంలోనైనా, హాలెండులోనైనా సరైన జీవితం కోసం వ్యక్తులు తప్పక అన్వేషిస్తూ వుంటారు అనిపించింది నరసింహానికి.

బాల్యంలోకి కాదుకానీ, తను ఉద్యోగంలోకి ప్రవేశించిన రోజుల వెనక్కు పోతే ఎంతో బాగుంటుంది..... అది ఏర్పర్చిన వొత్తిళ్ళు, అలవాట్లు, బలహీనతలు, పైపైన వ్యవహరించేతీరు వదల్చుకుంటే ఎంత తేలికగా వుంటుంది .... సస్కియా దేహాన్ని యిబ్బంది పెట్టిన పదార్థంలా తనను దారి తప్పిస్తున్నదేదో తన మనసును అవసరమయితే నలిపైనా సరే, ఒక విస్ఫోటనంగా తననుండి బయటికి ముక్కలయిపోతే ఎంత బాగుంటుంది ..... మనం కోరి తెచ్చుకొనే సుఖాలు, మనం పోగొట్టుకొనే అంతే సంతోషానికి సమానమా, అర్కిమెడిస్ సూత్రంలా ..... ఇలాంటి ఆలోచనలతో నిద్రపట్టకుండా పొర్లుతూ ఎంతసేపు గడిపాడో నరసింహానికే తెలియదు.

లేచి వచ్చి తిరిగి చూసేసరికి, ఇద్దరూ ఒకరికి ఎదురుగా మరొకరు తమ భాషలో చిన్నగా మాట్లాడుకొంటూ, కమలాపళ్ళు తింటున్నారు. నరసింహం ముఖం సంతోషంతో వెలిగిపోయింది.

"నరసింహం అలా బయటికి వెళ్దామా?' అంది సస్కియా చిన్నగా నవ్వుతూ, ఆశ్చర్యం వేసినా ముఖంలోనే దాచుకొంటూ కాళ్ళు చేతులు వసారాముందు వున్న కాల్వలో కాళ్ళు చేతులు కడుక్కొని వారితోపాటు బయలుదేరాడు నరసింహం.

దూరంగా సూర్యుడు అస్తమించేందుకు సిద్ధమవుతున్నాడు. అప్పుడే కొత్త రూపాల్ని తీసుకొనబోయే రంగుల్ని ఆసక్తిగా చూస్తూ నడకసాగించాడు యాన్. జనం వీరికేసి వింతగా చూస్తూ నడుస్తున్నారు. పిల్లలు కూడా వెంట వస్తున్నారు. ఆరు అడుగుల పైగా వున్న యాన్‌తో పోటీ పడుతున్నట్టు వున్న అందమయిన ఆమె భారీ విగ్రహాన్ని చుడీదార్, జుబ్బాలో చూస్తుంటే స్త్రీ భావన గుర్తుకు రావటం లేదు నరసింహానికి.

"మీరేదో పోగొట్టుకొన్నట్టు కనిపిస్తుంటారు" అంది సస్కియా తన చేతిలోకి నరసింహం చేయిని - ఒక క్షణం తదేకంగా అతని కళ్ళల్లోకి చూస్తూ.

"ఏం పోగొట్టుకొన్నామో అనే విషయం వ్యక్తికి అంత తొందరగా తెలిస్తే అంత కంటే అద్భుతమేముంటుంది, సస్కియా...." ముఖం మీదికి నవ్వు తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు నరసింహం.

ఆ నవ్వును చూశాక మరో ప్రశ్న అడగటానికి వెనకాడుతూ, అతని చేయిని గట్టిగా అలాగే పట్టుకొని నిశ్శబ్దంగా నడిచింది సస్కియా.

*

గాజుకెరటాల వెన్నెల సముద్రాలూ
జాజిపువ్వుల అత్తరు దీపాలూ
మంత్రలోకపు మణిస్తంభాలూ
నా కవితా చందనశాలా సుందరచిత్ర విచిత్రాలు

\- తిలక్